epaper.manachourasta.com

# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక



కొత్తకొండ జాతరకు భారీ ఏర్పాట్లు

2

సంపుటి : 01 | సంచిక : 46 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 13 జనవరి 2026 | పేజీలు : 04

## పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయండి

- హాస్టల్ లను సందర్శించండి
- మినీ మేడారానికి ఏర్పాట్లు చేయండి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మన చౌరాస్తా :** ప్రజల సమస్యలను తీర్చడానికి అధికారులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా.. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్య లను విన్నవించుకునేందుకు వచ్చిన ప్రజలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్య లను తెలుసుకొన్నారు. వారు ఇచ్చిన దరఖాస్తులను తీసుకోని సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసారు. గ్రీవెన్స్ కార్యక్రమానికి... 43 దరఖాస్తు లు రాగా.. వాటిని సంబంధిత శాఖ అధికారులకు తగు చర్యలు తీసుకోవాలన్నారు.



## ఘనపురం అభివృద్ధే నా లక్ష్యం

- మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ ను గెలిపించాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధే ఏకైక లక్ష్యంగా తాను పని చేస్తున్నానని, నా లక్ష్యం నెరవేరాలంటే నియోజకవర్గ ప్రజల సహకారం కావాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలో 7 కోట్ల రూపాయలతో పలు కాలనీలలో చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషాతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు.

3



# కొత్తకొండ జాతరకు భారీ ఏర్పాట్లు

**రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్**



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో కొలువైన భద్రకాళి సమేత కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయంలో జరుగుతున్న జాతర ఉత్సవాల్లో ( బ్రహ్మోత్సవాలు) భక్తులు భారీగా పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 9వ తేదీన ప్రారంభం అయ్యాయని తెలిపారు. పదో తేదీన స్వామివారి కళ్యాణోత్సవం జరిగిందన్నారు. బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారని, ఈ నెల 9 నుండి 18 వ తేదీ వరకు జరిగే కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు సుమారు నాలుగు నుండి ఐదు లక్షల వరకు భక్తులు హాజరవుతారనే అంచనా ఉందన్నారు. ఆలయంలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివారిని భక్తులు దర్శించుకునేందుకు క్యూ లైన్లను ఏర్పాటు చేశారని. ప్రత్యేక, ధర్మ, వీఐపీ, అభిషేకం దర్శనాలకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను పూర్తి చేశారని, భక్తుల కోసం చలువ పందిళ్లను సిద్ధం చేయడంతో పాటు భక్తులకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని. తీర్థ స్నానాలు ఆచరించేందుకు నీటి సదుపాయాన్ని ఏర్పాటు, ఆలయంతో పాటు ప్రాంగణం చుట్టూ విద్యుత్ దీపాలతో అలంకరణ, ఆలయ కూడలి వద్ద 20 లక్షల రూపాయలతో నిర్మించిన త్రిశూలం ను ఈనెల 10వ తేదీన ప్రారంభించడం జరిగినదన్నారు. ఆలయానికి వెళ్లే మార్గంలో నిర్మించిన త్రిశూలం భక్తులను ఆకట్టుకుంటుందని, ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ఉండేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామని, 350 మంది పోలీసులు కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తారని, ఆలయం వద్ద పరిసరాల ఎప్పటికప్పుడు పరిశుభ్రతకు దాదాపుగా 150 మంది పారిశుద్ధ్య కార్మికులు, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అక్కడే వైద్య సేవలను అందించే విధంగా చర్యలు చేపట్టారు. షిఫ్టుల వారిగా వైద్యులు సిబ్బంది ఆలయానికి దర్శన నిమిత్తం వచ్చే భక్తులకు వైద్య సేవలను అందిస్తారని, ఆలయంతో పాటు ప్రాంగణం, చుట్టుపక్కల దాదాపుగా 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ, ఆలయంలో భక్తుల కోసం కోడెలు అందుబాటులో ఉండగా భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అదనంగా వేములవాడ నుండి ప్రత్యేకంగా 8 కోడెలను తెప్పించడం జరిగిందన్నారు. భక్తులకు ఎక్కడ కూడా ఇబ్బందులు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేశారని, కాగా భక్తులు అధిక సంఖ్యలో శ్రీ భద్రకాళి సమేత స్వామి వారిని దర్శించుకోవాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ భక్తులకు విజ్ఞప్తి చేశారు.

## సొంత నిధులతో బోరు ఏర్పాటు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో నాలుగో వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యకు గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ సొంత నిధులతో బోరు వేయించి శాశ్వత పరిష్కారం చూపించారు. ఇటీవలే సర్పంచ్‌గా ఎన్నికైన గజ్జల సృజన రమేష్, ఎన్నికల అనంతరం కేవలం నెల రోజుల్లోనే గ్రామ ప్రజల సమస్యలపై స్పందిస్తూ కీలక నిర్ణయం తీసుకోవడం గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటోంది. నాలుగో వార్డులో తాగునీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న సర్పంచ్ వెంటనే తన సొంత ఖర్చులతో బోరు వేయించారు. ఈ బోరు ద్వారా ప్రస్తుతం స్థానికులకు తాగునీటి సమస్య తీరడంతో వార్డ్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల మౌలిక సదుపాయాల కల్పన తన మొదటి ప్రాధాన్యత అని, వంగర గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లాల రమేష్, వార్డ్ మెంబర్లు కాల్వ అంజలి, గజ్జల రమేష్, మారం సతీష్, శ్రీరామోజు మొండయ్య, బత్తిని రజిత, రఘు నాయకుల మహేష్‌తో పాటు గ్రామ పెద్దలు రఘు నాయకుల వెంకటరెడ్డి, తిరుపతిరెడ్డి, సతీష్ రెడ్డి, నల్లగోని ప్రభాకర్ గౌడ్, గజ్జల సంజీవ్, రొడ్డ అజయ్, దేవరాజ్, కాల్వ సంపత్, బత్తిన అశోక్, బల్ల రాజేష్, బత్తిని మొండయ్య తదితరులు పాల్గొని సర్పంచ్‌ను అభినందించారు.





## బీసీ జేఏసీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరాస్తాలో స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం జనగామ జిల్లా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో పండుగ హరీష్ ముదిరాజ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మంగళంపల్లి రాజు మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతకు ఆత్మవిశ్వాసం, దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను బోధించిన మహానుభావుడు అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు బీసీ జేఏసీ యువజన అధ్యక్షులు పండుగ హరీష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు నిమ్మల కుమారస్వామి యాదవ్, టిఆర్పి జిల్లా కార్యదర్శి చిర్ర వీరస్వామి, చంద్రశేఖర్, ప్రమోద్, చిక్కుడు నాగేష్, దాసరి అశోక్, దాసరి క్రాంతి, మంద అశోక్, చాడా నరేష్ పాల్గొన్నారు.

## ఎస్సై జాతర పనుల పరిశీలన

**పాలకుర్తి, మన చౌరాస్తా :** గంట్లకుంట ఏనే రామస్వామి జాతర బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆదివారం ఎస్సై చిలువేరు ప్రమోద్ కుమార్ గౌడ్, సర్పంచ్ ముత్తినేని యాకలక్ష్మీ పరిశీలించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. జాతర ప్రాంగణంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది గ్రామంలో అంగరంగ వైభవంగా జాతర బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. చెరుకు సత్యం, కన్నె సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## ఏకేవీఆర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ఏకేవీఆర్ జూనియర్ డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో ముందస్తుగా సంక్రాంతి వేడుకలను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణ, అలంకరణలతో కళాశాల ప్రాంగణం పండుగ కళను సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్ మాట్లాడుతూ సంక్రాంతి రైతు పండుగగా, కుటుంబ సభ్యులను ఐక్యంగా నిలిపే పండుగగా విశిష్టత కలిగి ఉందని వివరించారు. మన సంప్రదాయాలు, సంస్కృతి తరతరాలకు చేరాలంటే ఇలాంటి వేడుకలు అవసరమని తెలిపారు. ఈ వేడుకల్లో కళాశాల అధ్యాపకులు రాంబాబు, హరికృష్ణ, ఓదెలు, జ్యోతి, సుమన్, ఐలయ్య, శ్రీనివాస్, భారతి, రాధిక, రజని తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## వీరభద్రుడి సన్నిధిలో వాస్తు పూజ, బలిహరణ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో జరుగుతున్న జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వీరభద్రస్వామి ఆలయంలో వాస్తు పూజ హోమం, బలిహరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ కిషన్ రావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో సంప్రదాయ విధానాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండప పూజ, మహాన్యాసం, మంత్రపుష్పం, జ్యోతి లింగార్చన తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా సాగాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో సోమవారం ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వీరభద్రుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఉపప్రధాన అర్చకులు రాజయ్య, రాంబాబు, ముఖ్య అర్చకులు శ్రీకాంత్, వినయ్ శర్మతో పాటు ఇతర అర్చక బృందం పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## యువకుడి మృతదేహం లభ్యం



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామ శివారు గుమ్మి గుట్ట వద్ద సోమవారం యువకుడి మృతదేహం లభ్యమైంది. ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల అశోక్ (19) గత ఆరు రోజులుగా కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. ఈ నెల 6వ తేదీన కొత్తకొండ గ్రామంలోని ఎరువుల దుకాణంలో అతడు కొనుగోలు చేసిన దృశ్యాలు సీసీ ఫుటేజ్‌లో నమోదై సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అశోక్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం మంచినీళ్ల బండ తండాకు చెందిన గొర్రెల కాపరులు గుమ్మి గుట్ట ప్రాంతంలో దుర్వాసన రావడంతో పరిశీలించగా యువకుడి మృతదేహం గుర్తించారు. సమాచారం అందుకున్న గ్రామస్తులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలియజేశారు. ఏకైక కుమారుడైన అశోక్ గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేసినట్లు స్థానికులు తెలిపారు. కుమారుడు తిరిగి వస్తాడని ఆశతో ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ఇష్టానుసారంగా పురుగుల మందు అమ్మిన దుకాణంపై చర్య తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



# ఘనపురం అభివృద్ధే నా లక్ష్యం

- **మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ ను గెలిపించాలి**
- **ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్దే ఏకైక లక్ష్యంగా పని చేస్తున్నానని నా లక్ష్యం నెరవేరాలంటే నియోజకవర్గ ప్రజల సహకారం కావాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలో 7 కోట్ల రూపాయలతో పలు కాలనీలలో చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషాతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే గా అవకాశం కల్పిస్తే స్టేషన్ ఘనపూర్ ను మున్సిపాలిటీ చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చానని, ఇచ్చిన మాట ప్రకారం ఘనపూర్, శివునిపల్లి, చాగల్ గ్రామాలను కలిపి స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఏర్పాటు చేసినట్లు అందుకు సంబంధించి 25జనవరి 2025 రోజున ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో వెంకన్న, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి అర్జీల పరిష్కారానికి

# ప్రాధాన్యతనివ్వాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**
- **ప్రజావాణి కార్యక్రమానికి 110 అర్జీలు**

**హనుమకొండ, మన చౌరాస్తా :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను పరిష్కరించేందుకు అధికారులు ప్రధమ ప్రాధాన్యతను ఇవ్వాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులు, అధికారుల తో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించాలని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ను నేరుగా కలిసి విన్నవిస్తూ అర్జీలను అందజేశారు. ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తూ వారు చెప్పిన అంశాలను కలెక్టర్ ఓపికగా విన్నారు. అక్కడే ఉన్న సంబంధిత శాఖల అధికారులను అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు మండలాల తహసిల్దార్లతోనూ ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం 110 అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రతపై అవగాహన

**జనగామ, మన చౌరాస్తా :** జాతీయ రోడ్డు భద్రతా మాస ఉత్సవాలలో భాగంగా స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జనగామ రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో యువతి యువకులకు రోడ్డు భద్రత అవగాహన నిర్వహించారు. రవాణా శాఖ అధికారులు మాట్లాడుతూ.. దేశానికి యువ యువశక్తి చాలా ముఖ్యమని మరియు ప్రమాద మరణాలలో ఎక్కువ యువశక్తి నష్టపోతున్నారని, అందుకుగాను అందరం రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ యువశక్తిని కాపాడుకోవాలని సూచించారు. రవాణా శాఖ ఏ ఎం వి ఐ మహేష్ గౌడ్, ఏ ఎమ్ వి ఐ శ్వేతా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




# చీటకోడూరు మీదుగా బస్ నడపాలి

**జనగామ, మన చౌరాస్తా :** చీటకోడూర్ మీదుగా ఆర్టీసీ బస్సు నడపాలని చీటకోడూరు స్వర్పంచ్ కూకట్ల యాదగిరి, యాసారపు కరుణాకర్, రావుల రాజేష్ కోరారు. ఈ మేరకు సోమవారం జనగామ డిపో మేనేజర్ స్వాతికి వినతి ప్రతాన్ని అందజేశారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు కూలిపోయిన చీటకోడూర్ కల్వర్టును తాత్కాలికంగా మరమ్మతు చేశారని వివరించారు. చీటకోడూర్, చౌడారం మీదుగా మరిగడికి బస్సు నడపాలని కోరారు.




# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లిమండల కేంద్రంలోని మర్రిముచ్చాల గ్రామం లో సర్పంచ్ జంగని రవి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. బీసీ కమిషన్ మెంబర్ శ్రీమతి రంగు బాల్ లక్ష్మీసహకారంతో పుల్లం రాములు రూ.29,000/ మరియు వంగ ప్రసాద్ రెడ్డి రూ.24,000/ విలువైన చెక్కులను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జంగని రవి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి పేద మరియు అవసరమైన వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం అర్హుల వరకు చేరేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బద్దిపడిగా రఘుపతి రెడ్డి, తురాయి నవీన్, వంగ కృష్ణ రెడ్డి, రంగు అయిలేని గౌడ్, వంగ సంజీవరెడ్డి, మంత్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక్ డెంటల్ క్లినిక్ను సందర్శించిన ఎంపీ చామల

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణ కేంద్రంలో నూతనంగా డాక్టర్ అంబటి కార్తీక్ రాజు నూతన భవనంలోని ఏర్పాటు చేసిన డెంటల్ క్లినిక్ ను భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు పూల బొకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ హైదరాబాద్ తరహాలో అత్యాధునిక పరికరాలతో మంచి సేవలు జనగామ ప్రజలకు అందించాలని డాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో జనగామ డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, టిపిసిసి మెంబెర్ డా.లక్ష్మినారాయణ నాయక్, కాంగ్రెస్ నాయకులు నాగపూరి కిరణ్ పాల్గొన్నారు.



# తొలిరోజే చిరు జోరు

పండగకు వస్తున్నారు.. అంటూ టాలీవుడ్‌లో పండగ తీసుకొచ్చారు మన శంకరవరప్రసాద్ గారు. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకుల ముందుకువచ్చి హిట్‌టాక్‌తో అలరిస్తోంది. చాలా రోజుల తర్వాత వింటేజ్ చిరును చూశామంటూ అభిమానులు సంబర పడుతున్నారు. దీంతో ప్రీమియర్స్ పూర్తికాగానే మూవీ టీమ్ సక్సెస్ సెలబ్రేషన్స్ చేసుకుంది. చిరంజీవితో పాటు అనిల్ రావిపూడి, సాహు గారపాటి, సుస్మిత కొణిదెల కేక్ కట్ చేసి స్వీట్స్ తినిపించుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ పెద్ద పండగకు భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా వాటిని అందుకోవడంలో విజయం సాధించింది. దీంతో టికెట్స్ హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. తాజాగా చిరు ఈ సినిమాతో మరో ఘనత సాధించారు. ప్రీమియర్స్‌లోనే వన్ మిలియన్ డాలర్లరు వసూలు చేసిన చిరు రెండో చిత్రంగా ఇది నిలిచింది. మరోవైపు ప్రముఖ టికెట్ బుకింగ్ యాప్ బుక్‌మై షోలో 24 గంటల్లో 2లక్షల 86వేల టికెట్స్ అమ్ముడైనట్లు పేర్కొంది.





Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**